APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 07 నవంబర్ 2026 సంపుటి: 01 సంచిక :160 పేజీలు : 04 వెల: 2-00/-

చీరాలలో 10 స్థానాల్లో గెలుపు.. కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయం



చీరాల మున్సిపాలిటీలో 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయం

42 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్.. చాలా చోట్ల రెండో స్థానంలో నిలిచిన పార్టీ

ఆమంచి కృష్ణమోహన్ కృషిని ప్రశంసించిన పీసీసీ చీఫ్ షర్మిల

పీఠం దక్కకపోయినా ఇది నైతిక విజయమన్న షర్మిల

కూటమి నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని వార్డు సభ్యులకు సూచన

అమరావతి: చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశంసించారు. ఈ ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 44 స్థానాల్లో భాగంగా కాంగ్రెస్ 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. మిగతా..2లో

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'.. త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్



రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మంది పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

యాప్ ద్వారా ఆరోగ్య వివరాల నమోదు.. రిస్క్ ఆధారంగా వర్గీకరణ

ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా వైద్య సాయం, కౌన్సెలింగ్ ఏర్పాటు

వ్యాధులు ముదరక ముందే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యం

హైదరాబాద్: తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఒక కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది కోసం 'ఫిట్ కాప్' అనే సమగ్ర ఆరోగ్య నిర్వహణ యాప్‌ను తీసుకురానున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడి, సమయాభావం కారణంగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఈ యాప్ ఆ లోటును భర్తీ చేస్తుందని ఆయన తెలిపారు. మిగతా..2లో

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు ముమ్మరం



- 11 కంపార్ట్‌మెంట్లలో వేచిచూస్తున్న భక్తులు
- టోకెన్ లేనివారికి సర్వదర్శనానికి 8 గంటల సమయం
- డిసెంబర్ 20 నుంచి వైకుంఠ ద్వార దర్శనానికి టీటీడీ ఏర్పాట్లు

అమరావతి : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ ఉదయం నాటికి, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 11 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 6 నుంచి 8 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గురువారం ఒక్కరోజే 65,218 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రకాశం తీరంలో విషాదం.. తమిళ మత్స్యకారుల మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

- ప్రకాశం జిల్లా కొత్తపట్నం వద్ద తమిళనాడు మత్స్యకారుల బోటు బోల్తా
- ప్రమాదంలో ఏడుగురు మృతి, మరో ఇద్దరి ఆచూకీ గల్లంతు
- ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు



అమరావతి : ప్రకాశం జిల్లా కొత్తపట్నం సమీపంలో తమిళనాడు మత్స్యకారుల బోటు బోల్తాపడిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను వెంటనే ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 3వ తేదీన 'మురసు' తుపాను కారణంగా ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో తమిళనాడుకు చెందిన ఈ బోటు సముద్రంలో బోల్తా పడింది. మొత్తం 9 మంది ప్రయాణిస్తున్న ఈ బోటులో ఏడుగురు మత్స్యకారులు మృతి చెందగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. మృతదేహాలు కొత్తపట్నం తీరానికి కొట్టుకువచ్చాయి. ఈ ఘటనపై స్పందించిన సీఎం చంద్రబాబు... గల్లంతైన ఇద్దరి ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోస్టుమార్టం ప్రక్రియను వేగంగా పూర్తిచేసి, మృతదేహాలను తమిళనాడులోని వారి స్వస్థలాలకు పంపేందుకు అక్కడి అధికారులతో కలిసి ఏర్పాట్లు చేయాలని సృష్టం చేశారు. ఈ దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత కూడా విచారం వ్యక్తం చేశారు. తుపాను వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు..



- భారీ వర్షాలతో ఏపీ జలాశయాల్లోకి చేరిన కొత్త నీరు
- మొత్తం 505.76 టీఎంసీలకు పెరిగిన నీటి నిల్వలు
- ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు
- శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు
- రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జలాశయాల్లోకి మిగతా..2లో

'ఇది కేవలం ఓట్ల చోరీ కాదు పౌరుల హక్కుల చోరీ' సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడీ లింక్ పై రాహుల్ ఫైర్

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడానికి ఆధార్ స్థానంలో ఓటర్ ఐడీ ముడిపెట్టాలన్న కేంద్రమంత్రి లలన్ సింగ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు.



ఢిల్లీ : ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆధార్ కార్డుకు బదులుగా ఓటర్ ఐడీ కార్డుతో ముడిపెట్టాలన్న ప్రతిపాదనను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. దీని వెనుక పౌరుల ఓటు హక్కును, ప్రాథమిక హక్కులను కాలరాసి శాశ్వతంగా అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండే లోతైన కుట్ర దాగి ఉందని ఆరోపించారు. బీజేపీకే మెజారిటీ వచ్చేలా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నారని, ఇప్పుడు అదే జాబితా ఆధారంగా ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయించబోతున్నారని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు అనేది పౌరుల హక్కు అని, పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చలేరని ఆయన తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. ఈ హక్కుల చోరీని తాము ఎట్టిపరిస్థితుల్లోనూ జరగనివ్వబోమని తేల్చిచెప్పారు. గల్లీకో సంస్థ ఐదు నిమిషాల్లోనే ఆధార్ కార్డులు తయారు చేసి ఇస్తోందని, అందుకే ఆధార్ బదులు బయోమెట్రిక్, ఓటర్ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కేంద్రమంత్రి లలన్‌సింగ్ మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ పంచుకున్నారు. ముసుగులో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగిస్తున్నారు. దీన్ని ఆపకపోతే, ఇంకా ఎంతమంది పేర్లను తొలగిస్తారో తెలియదు. బీజేపీని గద్దె దించాలని నిర్ణయించుకున్న వారి పేర్లను ప్రత్యేకంగా ఎంపిక చేసి తొలగిస్తారు. మిగతా..2లో

వరల్డ్ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా ఇండియా- సెమీకండక్టర్ రంగంలో మరో ముందడుగు




- ప్రపంచ ఏఐ అప్లికేషన్ రాజధానిగా భారత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.
- శుక్రవారం ఆయన సెమికాన్2.ా వెబ్ అప్లికేషన్ పోర్టల్‌ను ప్రారంభించారు.

ఢిల్లీ :ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ సెమీకండక్టర్ రంగాలు శరవేగంగా మారుతున్న వేళ భారతదేశం గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా ఎదిగేందుకు పదునైన వ్యూహాల్ని అమలు చేస్తోంది. తాజాగా భారత్‌ను

ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

- కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్న విజయసాయిరెడ్డి
- ఈ నెల 11న పార్టీ ఆవిర్భావం
- పలువురు నేతలు పార్టీలో చేరిక
- రెండు కుటుంబాల పాలనకు ప్రత్యామ్నాయంగా వస్తున్నామన్న మాజీ ఎంపీ
- జగన్ పొమ్మనకుండా పొగబెట్టి బయటకు పంపించారని తీవ్ర ఆరోపణ



అమరావతి : రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తాను స్థాపిస్తున్న కొత్త పార్టీలో పలువురు నాయకులు చేరుతున్న సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ నుంచి తనను జగన్ అవమానించి బయటకు పంపించారని, పొమ్మనకుండా పొగబెట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ నెల 11వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భావం ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీలో చేరికలను స్వాగతించారు. విశ్వ హిందూ పరిషత్‌లో దశాబ్దాలుగా పనిచేసిన సుమతి రెడ్డి, మిగతా..2లో

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే



- కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు
- పరిస్థితిని 'రేవంత్ వృష్టి'గా అభివర్ణన
- దేవాదుల నుంచి 18 టీఎంసీలే ఎత్తిపోశారని ఆరోపణ
- కల్వకుర్తి మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని విమర్శ
- పంటల బీమా అమలు చేయలేదని కాంగ్రెస్‌పై ధ్వజం

హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్.. రేపటి నుంచి మూడ్రోజుల పర్యటన

- సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు
- సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు
- పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు



హైదరాబాద్ : తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. మిగతా..2లో

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్!



- సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై మంత్రి పొన్నం ఆగ్రహం!
- కార్మికులను నేలపై కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి సూచన
- కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరిక

హైదరాబాద్ : సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు.

మొదటి పేజి తరువాయి

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు ముమ్మరం

వీరిలో 20,213 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లుగా నమోదైంది. మరోవైపు, ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు పది రోజుల పాటు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనానికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనభాగ్యం కల్పించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమీక్షలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం, తొలి మూడు రోజులు (డిసెంబర్ 20-22) ఆన్‌లైన్ ఈ-డిప్ విధానంలో ఎస్ఎస్‌డీ టోకెన్లు కేటాయించనున్నారు. మిగిలిన ఏడు రోజులు (డిసెంబర్ 23-29) పూర్తిగా సర్వదర్శనం భక్తులకు అనుమతిస్తారు. డిసెంబర్ 25వ తేదీన అభిషేక సేవ సమయంలో కూడా సర్వదర్శనం భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్!

కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!:

అనకాపల్లికి చెందిన హిందూ ఎస్సీ, ఎస్టీ కులాల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సుమతి రెడ్డి రాబోయే ఎన్నికల్లో తిరుపతి జిల్లా నుంచి శాసనసభకు పోటీ చేస్తారని, నియోజకవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ చేరికలు తమ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని, అన్ని కులాలు, మతాలు, వర్గాలకు సమన్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. "రాష్ట్రాన్ని రెండు కుటుంబాల చేతుల్లో పెట్టకూడదు. రాజ్యాంగబద్ధంగా ఎవరి హక్కులు వారికి దక్కాలి. యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అంతర్గత ప్రజాస్వామ్యంతో మా పార్టీ నడుస్తుంది" అని ఆయన వివరించారు.

జగన్ నన్ను బయటకు గెంటేశారు

వైసీపీ నుంచి బయటకు రావడానికి గల కారణాలను వివరిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "నేను పార్టీని వదిలి వెళ్ళలేదు, నన్ను బయటకు తోసేశారు. పొమ్మనకుండా పొగబెట్టి, అప్పుడప్పుడు అవమానించి, ఒక మనిషిగా భరించలేనటువంటి పరిస్థితులు కల్పించారు. అందుకే ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు నన్నెప్పుడూ అవమానించలేదు. కానీ జగన్ పాలనలోనే ఇది జరిగింది. చెప్పుడు మాటలు విని నన్ను దూరం పెట్టారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకటి రెండు కాదు, 70కి పైగా అవమానాలను భరించానని,

ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పనులు చేస్తే ఎవరైనా ఎలా ఊరుకుంటారని ప్రశ్నించారు. "ప్రతి మనిషికీ ఆత్మగౌరవం ఉంటుంది. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినప్పుడు ఇక అక్కడ ఉండలేకపోయాను. కూర్చున్న కొమ్మను నరికేసినప్పుడు ఇంకేం చేయగలం? అందుకే బయటకు వచ్చాను" అని అన్నారు.

హిందూత్వ ముద్రపై స్పందన

పార్టీలో కాషాయ రంగు ప్రభావం ఎక్కువ అంటున్నారనే విమర్శపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ, "మనం భారతమాత బిడ్డలం. మన అమ్మ గురించి మనం గొప్పగా చెప్పుకుంటాం. అలాగని ఇతరులను ద్వేషించం. భారతదేశంలోని ప్రతి క్రిస్టియన్, ముస్లిం వెనుక భారతీయ డీఎన్ఏ ఉంది. ఇది నిరూపితమైన సత్యం. మేము హిందూ ధర్మం గురించి మాట్లాడితే ఇతరులకు వ్యతిరేకం కాదు. అందరికీ సమన్యాయం చేయడమే మా పార్టీ ఉద్దేశం," అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆయన విమర్శించారు. తాము పెట్టబోయే పార్టీలో ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూసుకుంటామని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే మూడో ప్రత్యామ్నాయంగా తమ పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చీరాలలో 10 స్థానాల్లో గెలుపు.. కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయం: షర్మిల

వారిలో 10 మందిని గెలిపించడంతో పాటు, మిగతా స్థానాల్లోనూ పార్టీని రెండో స్థానంలో నిలబెట్టడంలో ఆమంచి ప్రత్యక్షంగా కృషి చేశారని షర్మిల పేర్కొన్నారు. "కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థుల గెలుపు మీ కష్టానికి దక్కిన ప్రతిఫలం. స్థానికంగా ప్రజా సమస్యలపై మీ అకుంఠిత పోరాట పటిమకు నిదర్శనం" అని ఆమె అన్నారు. చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం నిజమైన ప్రజాస్వామ్య విజయమని, రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయమనడానికి ఇదొక సంకేతమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజల గొంతుకను నొక్కిపట్టాలని చూసిన కూటమి శక్తులను ఎదురించి, అధికార బలాన్ని తట్టుకుని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజా పక్షాన నిలిచి గెలిచిన వార్డు సభ్యులను షర్మిల అభినందించారు. అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓటేసిన చీరాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోలేకపోయినా, గౌరవప్రదమైన స్థానాలు దక్కించుకుని ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్న కాంగ్రెస్‌దే చీరాలలో అసలైన నైతిక విజయమని ఆమె అన్నారు. చీరాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టేలా అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆమె సూచించారు. గెలుపొందిన కాంగ్రెస్ వార్డు సభ్యులు అంకితభావంతో పనిచేస్తారని ఆశిస్తున్నట్లు షర్మిల తెలిపారు.

తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'.. త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్



హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో 'టీజీ ఫిట్‌కాప్' పేరుతో ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యాప్ ద్వారా సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×), జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి కీలక సమాచారాన్ని సేకరిస్తారు. సిబ్బంది తమ మొబైల్ ఫోన్ నంబర్‌తో ఈ సిస్టమ్‌లోకి లాగిన్ కావచ్చు. వారు అందించిన సమాచారం ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా వర్గీకరిస్తారు. ఈ రిస్క్ అసెస్‌మెంట్ ద్వారా ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ మాట్లాడుతూ, రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రిలో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందిస్తామని వివరించారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవి తీవ్రం కాకముందే వైద్య సహాయం అందించడం 'ఫిట్ కాప్' ప్రాథమిక లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో ఆరోగ్య స్పృహను పెంచి, నివారణ చర్యలను ప్రోత్సహించాలని పోలీస్ శాఖ భావిస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు, విభాగాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. 'ఫిట్ కాప్' సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటానికి ఒక ముఖ్యమైన వ్యవస్థాగత యంత్రాంగంగా ఎదుగుతుందని డీజీపీ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు.. ఎక్కడ ఎంతంటే?

మొదటి పేజి తరువాయి



కొత్తగా నీరు వచ్చి చేరింది. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం రిజర్వాయర్లలో మొత్తం 505.76 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇది జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీలలో సుమారు 43.51 శాతానికి సమానం. వర్షాలు కొనసాగితే మరో 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉందని అధికారులు తెలిపారు. నదీ బేసిన్ల వారీగా చూస్తే, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో అత్యధికంగా 318.27 టీఎంసీలు (42.47% సామర్థ్యం), పెన్నా బేసిన్‌లో 107.74 టీఎంసీలు (36.47%), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72%) నిల్వ ఉన్నాయి. ఇతర బేసిన్లలోని ప్రాజెక్టులలో కలిపి 58.72 టీఎంసీల నీరు ఉంది. అయితే, ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మిశ్రమంగా ఉన్నాయి. శు క్రవారం నాటి లెక్కల ప్రకారం, శ్రీశైలం డ్యామ్‌లో 215.81 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 51.60 టీఎంసీల (23.9%) నీరు మాత్రమే ఉంది. ఇక్కడ నీటిమట్టం 885 అడుగులకు గాను 832 అడుగుల వద్ద ఉంది. నాగార్జున సాగర్‌లో 180.91 టీఎంసీలు (58%), పులిచింతలలో 28.19 టీఎంసీల (61.6%) నీరు నిల్వ ఉంది. మరోవైపు, పెన్నా బేసిన్‌లోని సోమశిల ప్రాజెక్టులో 19.74 టీఎంసీలు (25.3%), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6%) ఉన్నాయి. అదే సమయంలో, గండికోట (69.5%), గోరకల్లు (78.8%), ఏలేరు (91%) వంటి రిజర్వాయర్లలో నీటిమట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, నవంబరు 4 ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5 ఉదయం 8:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మొత్తం మీద రాష్ట్రంలో నీటి నిల్వలు పెరిగినప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు నిండాలంటే భారీ వర్షాలు అవసరమని స్పష్టమవుతోంది.

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్.. రేపటి నుంచి మూడ్రోజుల పర్యటన

మొదటి పేజి తరువాయి

నవంబర్ 7 (శనివారం):

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు.

పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు.

రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల (ఎస+) మహిళలతో సమావేశమవుతారు.

ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఎనజ) భవనాలను ప్రారంభిస్తారు.

బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు.

నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు.

కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు.

రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం):

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు.

పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ



రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే: రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్

మొదటి పేజి తరువాయి



అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

వరల్డ్ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా ఇండియా- సెమీకండక్టర్ రంగంలో మరో ముందడుగు

మొదటి పేజి తరువాయి

ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా మార్చడంపై ప్రభుత్వం, పారిశ్రామిక రంగాలు దృష్టి సారించాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. శు క్రవారం రోజు దిల్లీలో జరిగిన సెమికాన్ 2.ూ వెబ్ అప్లికేషన్ పోర్టల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాల్లో ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. దేశీయంగా సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. "ప్రపంచ ఏఐ పరిశ్రమలో తీవ్ర పరిణామాలు జరుగుతున్నాయి. వ్యవసాయం, వైద్యం సహా ఎన్నో రంగాల్లో ప్రాక్టికల్ ఏఐ మోడళ్లను ఉపయోగించడంలో భారత్ అగ్రగామిగా ఉండబోతోంది. ఇక్కడ పంటల నిర్వహణ, వైద్య సేవలు, బోధనా విధానాలు ఇలా ఎన్నో అంశాల్లో ఏఐ వినియోగానికి అవకాశాలు ఉన్నాయి. ఈ అప్లికేషన్ల అభివృద్ధిలో భారత పరిశ్రమలు మంచి పురోగతిని సాధిస్తున్నాయి. విదేశీ కంపెనీలతో పోటీపడుతూ భారత్‌ను ఏఐ అప్లికేషన్ రాజధానిగా మలచడమే మా లక్ష్యం."

సెమికాన్ 2.ూ పోర్టల్ ప్రారంభం

కొత్తగా తీసుకొచ్చిన సెమికాన్ 2.ూ పోర్టల్ కేవలం పూర్తి స్థాయి దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తుందని, సెమీకండక్టర్ రంగంలో పనిచేసే అత్యంత నిబద్ధత కలిగిన సంస్థలకు మాత్రమే ఇందులో చోటు ఉంటుందని అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. వాస్తవంగా పెట్టుబడులు పెట్టి, ప్రాజెక్టుల్ని అమలు చేయాలనే ఆసక్తి ఉన్న సంస్థలకే అవకాశం కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తుల్ని మాత్రమే పోర్టల్ స్వీకరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, అసంపూర్తిగా వచ్చే దరఖాస్తుల్ని స్వీకరించబోమని మంత్రి స్పష్టం చేశారు. టైమ్‌పాస్ దరఖాస్తుదారులకు స్థానం లేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే అర్హత లేని 18-19 కంపెనీలను తక్షణమే తొలగించాలని ఐటీ సెక్రెటరీని ఆదేశించినట్లు వెల్లడించారు. మరోవైపు దేశీయంగా గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (ూపు) చిప్‌ను అభివృద్ధి చేసే రోడ్‌మ్యాప్ కూడా తుది దశకు చేరుకుంటోందని వైష్ణవ్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (జుజుమీ) కింద మరో 12 దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ శుక్రవారం వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ రూ. 7500 కోట్లకుపైగా ఉంది. వీటిల్లో ఎలక్ట్రానిక్స్ విడిభాగాలతో పాటు ముడి పదార్థాలు, తయారీకి అవసరమైన యంత్రాలు, పరికరాలకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ వ్యవస్థను అభివృద్ధి చేయడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఈసీఎంఎస్ కింద ఆమోదం పొందిన యూనిట్లలో 50 శాతం చిన్న, మధ్యతరహా సంస్థలు (ూవీజుం), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (మీవీజుం) ఉన్నాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇదే సమయంలో భారత్ ఎదిగిన తీరు గురించి మంత్రి ప్రస్తావించారు. దేశంలో మొబైల్ ఫోన్ తయారీ ప్రారంభమైన తొలినాళ్లలో భారత్ కేవలం అసెంబ్లింగ్‌కే పరిమితం అవుతుందని చాలా మంది



విమర్శించారని, ఇప్పుడు మాడ్యూల్స్, విడిభాగాలు, ముడి పదార్థాల తయారీ వరకు విస్తరించిందని అన్నారు.

సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం సూచనలు

చివరగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ బాధ్యతలపైనా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. పిల్లలు, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇతర ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు సంస్థలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదుల్ని పరిష్కరించడానికి సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. బాధిత పౌరులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, అయితే ప్రజలు నేరుగా తమ సమస్యల్ని తెలియజేసి పరిష్కారం పొందగలిగే ఫిర్యాదుల వ్యవస్థ అవసరం అని మంత్రి అభిప్రాయపడ్డారు.

'ఇది కేవలం ఓట్ల చోరీ కాదు పౌరుల హక్కుల చోరీ'

సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడీ లింక్ పై రాహుల్ ఫైర్

మొదటి పేజి తరువాయి



పేరు తొలగిస్తే ఓటు పోయినట్టే, ఓటు పోతే హక్కులు పోయినట్టే. ఫలితంగా ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునే వ్యవస్థ పోయి, ప్రభుత్వమే తనకు నచ్చిన ప్రజలను ఎన్నుకునే పరిస్థితి వస్తుంది. ఈ రోజు పంచాయతీ రాజ్ పథకాలతో మొదలుపెట్టి, రేపు రేషన్, పెన్షన్లు, ఉపాధి హామీ, ఇళ్లు, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్లకు కూడా దీన్ని వర్తింపజేస్తారా? పేదవాడి పెన్షన్ ఓటర్ కార్డుకు బానిస కాకూడదు. ఇదంతా ఎన్నికల్లో గెలవడానికి చేసే రాజకీయాలు కాదు, ఎన్నికలను దొంగిలించడానికి ఏర్పాటు చేసిన శాశ్వత వ్యవస్థ. ఈ కుట్ర చాలా లోతుగా పాతుకుపోయింది. అసలు ఓటర్ల జాబితాలు నిష్పక్షపాత ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి, కానీ ఇప్పుడు అవి 'మోదీ ప్రభుత్వ ఉద్యోగి అయిన జ్ఞానేశ్ కుమార్' చేతిలో ఉన్నాయి. ఓట్ల దొంగతనంలో బీజేపీతో కుమ్మక్కైన అతడిని 'సాక్ష్యాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం."

కాలుష్య నివారణకు సంస్కరణలు అవసరం

ఇదిలా ఉండగా, దేశంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో కాలుష్యం కోరలు చాస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా కాలుష్యాన్ని నివారించడానికి, దాదాపు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమానికి తక్షణ సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ విశ్లేషణ ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్య సంక్షోభం మరింత తీవ్రంగా ఉందని మాజీ పర్యావరణ మంత్రి అన్నారు.

పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజల అవస్థలు

మరోవైపు, దేశంలోని సాధారణ ప్రజలు ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల), అప్పుల ఊబిలో కూరుకుపోయారని కాంగ్రెస్ ఆరోపించింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో బీజేపీని ఓడించి, పెరుగుతున్న ధరలపై తమ నిరసనను తెలియజేసే బాధ్యత ఇప్పుడు ఆయా రాష్ట్రాల ఓటర్లపైనే ఉందని పేర్కొంది. మోదీ ప్రభుత్వ హయాంలో సామాన్యుల జీవితాలు ద్రవ్యోల్బణం, అప్పుల్లో చిక్కుకుపోయాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. కూరగాయలు, పండ్లు, పప్పులు, వంట నూనె, పాలు, పిండి వంటి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల భారంతో పేద, మధ్యతరగతి ప్రజల నడుము విరిగిపోతోందని అన్నారు.

అనంత సూర్య తెలుగువార

నీకు చేతనైతే.. నా కొడుకు మీద చేయి వేసి చూడు వసీం !

- మాజీ మేయర్ వసీంకు 82 ఏళ్ల సామాజిక సేవకురాలు ఏజీ. ప్రమీలమ్మ సూటి సవాల్ !
- రోజు, సమయం చెప్పు.. సప్తగిరి సర్కిల్‌లోని నీ దుకాణం దగ్గరకే నా కొడుకును తీసుకొస్తా.. దమ్ముంటే చేయి వేసి చూడు !
- ఏడున్నరేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతున్న నా కొడుకును బెదిరిస్తారా ?
- రౌడీలు, గూండాలకు భయపడే కుటుంబం మాది కాదు..



అనంతపురం, నవంబర్ 6 అనంత సూర్య :

అనంతపురం నగర మాజీ మేయర్ వసీంపై 82 సంవత్సరాల సామాజిక సేవకురాలు, ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కురాలు ఏజీ. ప్రమీలమ్మ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన కుమారుడు, డిస్మవర్ అనంతపురం వ్యవస్థాపకుడు, సామా జిక కార్యకర్త అనంతపురం జి.అనిల్ కుమార్‌ను కొడతా నంటూ మాజీ మేయర్ వసీం కొంత మంది వ్యక్తుల వద్ద మాట్లాడుతున్నారనే సమాచారం తన దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన ప్రమీలమ్మ, "వసీం.. నీకు చేతనైతే నా కొడుకు మీద చేయి వేసి చూడు.. నువ్వే రోజు, సమయం చెప్పు.. సప్తగిరి సర్కిల్‌లోని నీ దుకాణం దగ్గరకు నా కొడుకును నేనే తీసు కొస్తా.. అప్పుడు చూద్దాం.. నీ ధైర్యం ఎంతో" అంటూ బహిరంగ సవాల్ విసిరారు.

ఏడున్నరేళ్లుగా ప్రజల కోసం పోరాడుతుంటే బెదిరింపులా ?

తన కుమారుడు అనిల్ కుమార్ గత ఏడున్నర సంవత్సరాలుగా అనంతపురం నగరంలోని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని ప్రమీలమ్మ గుర్తు చేశారు. నగర పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై అధికారులను ప్రశ్నిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పనిచేస్తున్న వ్యక్తిని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. "నా కొడుకు ఎవరినీ వ్యక్తి గతంగా లక్ష్యంగా చేసుకొని పోరాడటం లేదు. నగర ప్రజల కోసం, భావితరాల భవిష్యత్తు కోసం ప్రశ్నిస్తున్నాడు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి. అంతేకానీ కొడతానని బెదిరించడం ఏమిటి ? ఇదేనా ఒక మాజీ ప్రజాప్రతినిధి సంస్కారం ?" అని నిలదీశారు.

గతంలో కెమెరాలు లాక్కున్న ఘటనను గుర్తు చేసిన ప్రమీలమ్మ

వసీం వ్యవహారశైలిపై తమకు అభ్యంతరాలు ఉండటం ఇదే మొదటిసారి కాదని ప్రమీలమ్మ పేర్కొన్నారు. గతంలో డిస్మవర్ అనంతపురం బృంద సభ్యుడి వద్ద నుంచి కెమెరాలను వసీం లాక్కున్న ఘటన కూడా జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని వెల్లడించారు. అయినప్పటికీ వసీం వ్యవహారశైలిలో మార్పు రాలేదని, అనుచిత వ్యాఖ్యలు, బెదిరింపుల ధోరణి కొనసాగుతూనే ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకసారి జరిగితే పొరపాటు అనుకోవచ్చు. పదేపదే అదే ధోరణి కొనసాగితే దాన్ని ఏమనుకోవాలి ? ప్రజా ప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి సమాజానికి ఆదర్శంగా ఉండాలి. బెది రింపులతో ప్రజల గొంతు నొక్కాలని చూడటం సరికాదు" అని వ్యాఖ్యానించారు.

రౌడీలు, గూండాల చేతిలో దెబ్బలు తినడానికి మేము లేము !

ఇన్నాళ్లూ సంయమనం పాటించామని, అయితే బెదిరింపులను ఇకపై మౌనంగా భరించే ప్రసక్తే లేదని ప్రమీలమ్మ స్పష్టం చేశారు. "మేము రౌడీలు, గూండాల చేతిలో దెబ్బలు తినడానికి ఇక్కడ లేము. ప్రజల కోసం పని చేస్తున్న వ్యక్తిపై చేయి చేసుకుంటామని మాట్లాడటం సహించేది లేదు. మాకు చట్టం మీద, ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉంది. మా మౌనాన్ని బలహీనతగా భావించవద్దు" అంటూ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, రాజకీయంగా విభేదించే హక్కు ఉన్నంత మాత్రాన భౌతిక దాడుల బెదిరింపులకు పాల్పడే హక్కు ఎవరికీ లేదని అన్నారు.

ఖురాన్‌పై ప్రమాణం చేసి చెప్పగలవా వసీం ?

"నువ్వు నా కొడుకును కొడతానని ఎక్కడా మాట్లాడలేదని ఖురాన్‌పై ప్రమాణం చేసి చెప్పగలవా వసీం ? నేను చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ధైర్యంగా ప్రజల ముందు చెప్పగలవా ?" అంటూ ప్రశ్నించారు. అయితే ఇది మతా నికి సంబంధించిన వివాదం కాదని, ఒక వ్యక్తి ప్రవర్తనకు, ఆయన మాటలకు సంబంధించిన జవాబుదారీతనం అంశమని ఆమె స్పష్టం చేశారు.

82 ఏళ్ల వయసులో నా కొడుకు కోసం కాదు.. ప్రశ్నించే ప్రతి పౌరుడి కోసం నిలబడుతున్నా !

తన కుమారుడిపై వస్తున్న బెదిరింపుల పట్ల ఒక తల్లిగా ఆవేదన చెందుతున్నప్పటికీ, ఇది కేవలం తన కుటుంబానికి సంబంధించిన సమస్య కాదని ప్రమీలమ్మ అభిప్రాయ పడ్డారు. "ఈ రోజు నా కొడుకును బెదిరిస్తే, రేపు మరో సామాజిక కార్యకర్తను బెదిరిస్తారు. ప్రజా సమస్యలపై మాట్లాడే ప్రతి ఒక్కరినీ భయపెట్టాలని చూస్తే సమాజం ఎలా బాగుపడుతుంది ? 82 ఏళ్ల వయసులో కూడా ఇటువంటి బెదిరింపులను ప్రశ్నించడానికి నేను వెనుకాడను" అని స్పష్టం చేశారు. చివరగా మాజీ మేయర్ వసీంను ఉద్దేశించి ప్రమీలమ్మ మరోసారి సవాల్ విసిరారు. "వసీం.. నా కొడుకును కొడతానని చెప్పుకుంటూ తిరగడం కాదు. నువ్వు ఏం మాట్లాడావో ప్రజల ముందు సమాధానం చెప్పు. నీకు అంత ధైర్యం ఉంటే రోజు, సమయం చెప్పు. నా కొడుకును నీ దుకాణం దగ్గరకే తీసుకొస్తా. నీ బెదిరింపులకు మేము భయపడేది లేదు. ఇకనైనా నీ ప్రవర్తన మార్చుకో !" అంటూ ఏజీ. ప్రమీలమ్మ తీవ్రంగా స్పందించారు.

కేజీబీవీలో మానసిక ఆరోగ్యం, కెరీర్ అవగాహన కార్యక్రమం



అనంతపురం, నవంబర్06,: విద్యార్థినుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు,భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సరైన కెరీర్‌ను ఎంచుకునేలా ప్రోత్సహించేందుకు బత్తలపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో మానసిక ఆరోగ్యం, కెరీర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి ఎమ్ యూ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రేంద్ర కుమార్, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మీపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరిస్తూ, చదువుతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని సూచించారు. అనంతరం విద్యార్థినులకు ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం, సమస్యలను ధైర్యంగా అధిగమించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే తమలోని ఆసక్తి, ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి భవిష్యత్తులో సరైన కెరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు.లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత సాయికి చేరుకోవచ్చని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్. గంగాధర్ నాయక్, గుర్రంపాటి నిరోషా, మల్లెల ఎవెలిన్ పాల్గొని వివిధ అంశాలపై విద్యార్థినులకు విలువైన సూచనలు,సలహాలు అందించారు. కేజీబీవీ సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొని సహకరించారు. విద్యార్థినులలో మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం, ఆత్మస్థైర్యం పెంపొందించడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు పేర్కొన్నారు.

అనంతపురం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. అవినీతి, వివాదాలకు దూరంగా ఉండాలి



అనంతపురం, అనంత సూర్య : అనంతపురం నగర అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన రమేష్‌గౌడ్‌తో పాటు గెలుపొందిన, ఓటమి చెందిన కార్పొరేటర్ అభ్యర్థులు, స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం వెనుక ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. అధికార పార్టీ నాయకుల దాడులు, దౌర్జన్యాలకు భయపడకుండా పార్టీ శ్రేణులు ధైర్యంగా నిలబడ్డాయని పేర్కొన్నారు.ప్రజలు ఎంతో నమ్మకంతో వైసీపీకి పట్టం కట్టారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.డివిజన్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కొన్ని డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని చెపా–్ఱరు.అందరూ ఐక్యంగా నిలబడటం వల్లే మేయర్ స్థానాన్ని గెలుచుకోగలిగామని తెలిపారు.ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజలకు మరింత చేరువ కావాలని, అవినీతికి తావులేకుండా నగరంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడటం ప్రధాన కర్తవ్యంగా భావించాలని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు పెరిగాయని ఆరోపించారు.ప్రజలు ఈ పరిణామాలను గమనించే వైసీపీకి మద్దతు తెలిపారని గుర్తుంచుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి అనంతపురం కార్పొరేష–న్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.మేయర్, కార్పొరేటర్ పదవులు అధికారం చలాయించడానికి కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాలని స్పష్టం చేశారు. ప్రజాసేవకు లభించిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని పేర్కొన్నారు.ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.మేయర్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి అనంతపురం నగరాన్ని సుందరంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని అన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో శ్రీ సత్యసాయి జిల్లా ముందడుగు

– కలెక్టర్ ప్రశంస

కొత్తచెరువు, అనంత సూర్య : శ్రీ సత్యసాయి జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ చర్యల్లో రాష్ట్ర స్థాయిలో 'సంఘర్షశీల్' నుంచి 'సక్షమ్' సా–ధించడం పట్ల జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ బృందాన్ని అభినందించారు.రాబోయే రోజుల్లో 'సురక్షిత్' స్థాయిని అందుకోవడమే లక్ష్యంగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం, బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు.గుర్తించిన ప్రతి కేసూ నమోదయ్యేలా చర్యలు తీసుకుని, సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని



పేర్కొన్నారు.బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకూ ఫాలో–అప్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సిలింగ్, ఏఆర్‌టీ చికిత్స ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. అవసరమైన రోగులకు ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు. అసురక్షిత శృంగారం, కలుషిత రక్తం, వాడిన సూదులను తిరిగి వాడటం, వ్యాధి సోకిన తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకే ప్రమాదం ఉందని, సురక్షిత



పద్ధతులు పాటిస్తూ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రగతికి కారణమైన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సమిష్టి కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. ఫిరోజా బేగం, డీఎల్‌వోటీ డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ ప్రణయ్, డెమో సెక్షన్, ఎస్‌వో సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు



యాడికి అనంత సూర్య ప్రతినిది నవంబర్ (6) : యాడికి మండలం చింతలాయపల్లి గ్రామానికి చెందిన గూడూరు రోశిరెడ్డి గారి ఆహ్వానం మేరకు వారి కుమారుని వివాహానికి యాడికి లోని టీడీడీ కళ్యాణమండపం నందు హాజరై నూతన వధూవరులు (ఇంద్రసేనారెడ్డి సుప్రియ) లను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో పిన్నెపల్లి శేఖర్ రెడ్డి నారాయణరెడ్డి భాస్కర్ రెడ్డి సుబ్బారెడ్డి రాజారెడ్డి వెంకటేష్ రామకృష్ణ కరుణాకర్ చిన్న తదితరులు పాల్గొన్నారు

దాసరి రంగప్పను పరామర్శించిన ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు కమిటీ సభ్యులు

యాడికి అనంత సూర్య ప్రతినిధి నవంబర్ (6) : అనంతపురం జిల్లా గుత్తి



మండలం గొందిపల్లి గ్రామ నివాసి దాసరి రంగప్ప గారుని మూత్రపిండాల వ్యాధితో బాధపడుతుండగా మూడు రోజుల క్రితం చికిత్స కోసం అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ గవర్నమెంట్ హాస్పిటల్ నందువచ్చి అడ్మిషన్ అయి చికిత్స పొందుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్ మాల మహానాడు నాయకులు అనంతపురం లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న దాసరి రంగప్ప గారిని కలిసి పరామర్శించి తొందరగా కోలుకోవాలని ఆయురారోగ్యాలతో బాగుండాలని కోరుకుంటున్నాము అని తెలియజేశారు. పరామర్శించు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు దళిత రత్న ఎం ఓబులేసు గారు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి చియ్యేడు రాము గారు అనంతపురం నగర ఉపాధ్యక్షులు బి సురేంద్ర గారు నగర ప్రధాన కార్యదర్శి వల్లూరు బాబు గారు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు కర్నాటి విజయ్ గారు అదేవిధంగా గొందిపల్లి దాసరి రంగస్వామి గారు సురేష్ తదితరులు పాల్గొన్నారు

జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కోసం సర్వం సిద్ధం

యాడికి అనంత సూర్య ప్రతినిధి నవంబర్(6) : గుంతకల్లు రెవెన్యూ డివిజన్ లో 4 కౌంటింగ్ కేంద్రాలు, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ లో 4 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరగగా, అందులో 9 మండలాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో గుత్తి, యాడికి, గుంతకల్లు, పెద్దవడుగూరు, పామిడి మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనుంది. జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ఎన్నికల ఏజెంట్లు, సిబ్బందిని మాత్రమే ప్రాంగణాల్లోకి అనుమతిస్తారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయం, అత్యవసర వైద్య శిబిరాలను సిద్ధంగా ఉంచాలని అన్ని విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



- ఇన్‌ఛార్జ్‌కిచ్చిన 3 డివిజన్లలోనూ జయకేతనం
- ఇదీ.. మున్నానగర్ రమేష్ మార్క్ రాజకీయం
- విద్యాధికురాలైన భార్య స్వాతి (జెన్‌జీ)కి డిప్యూటీ మేయర్ దక్కేనా !?

రాయల్, రాణింపు



అనంతపురం, నవంబర్ 6 అనంత సూర్య :

అనంతపురం నగర రాజకీయాల్లోనూ.. యూత్‌లోనూ ఆయన క్రేజ్ చెరగనిది. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం.. సామాజిక వర్గాల మధ్య మంచి పరిచ యాలు.. రాజకీయ నేతలతో సన్నిహిత సంబంధా లు.. వెరసి మున్నానగర్ రమేష్ రాజకీయ ప్రస్థానం నగరంలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా టీడీపీకి వీర విధేయుడుగా వస్తున్నారు.

మూడు డివిజన్లలోనూ విజయఢంకా..

ఎన్నికల సమయంలో తనకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించిన మూడు డివిజన్లలోనూ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం మున్నానగర్ రమేష్ రాజకీ య పనితీరుకు నిదర్శనంగా ఆయన వర్గీయులు పేర్కొంటు న్నారు. తనకు అప్పగించిన 8వ డివిజన్ కొత్తది అయినప్పటికీ.. కేవలం పది రోజుల్లోనే టీడీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసు కోవడం.. ప్రజల్లో మమేకమవుతూ తన భార్య తొండపునాటి స్వాతి గెలుపు కోసం విశేష కృషి చేశారు. అందుకు ఫలితంగా 931 ఓట్ల మెజార్టీతో గెలిపిం చుకున్నారు. తనకు అప్పగించి న డివిజన్‌కే పరిమితం కాకుం డా.. తొండపునాటి రమేష్ అలి యాస్ మున్నానగర్ రమేష్‌కు మరో రెండు డివిజన్ల లోనూ పార్టీ అభ్యర్థుల విజయానికి విశేషంగా కృషి చేశారు. 24వ డివిజన్‌లో మున్నానగర్ కార్పొరేటర్ అభ్యర్థి చాముండేశ్వరి 579 ఓట్ల మెజార్టీతో విజ యం సాధించగా, 25వ డివిజన్ అంబేద్కర్ నగర్ కార్పొరేటర్ అభ్యర్థి సోనియా 714 ఓట్ల మెజార్టీతో గెలుపునకు కీలకంగా వ్యవహరించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువతను కలుపు కొని ఎన్నికల ప్రచారంలో చురుకైన పాత్ర పోషించ డం విజయానికి దోహదపడిందని చెప్పవచ్చు. మూడు డివిజన్లలోనూ విజయాలు నమోదు కావడంతో మున్నానగర్ రమేష్ పేరు మరోసారి రాజకీయ వర్గాల్లో మార్మోగింది. ఎన్నికల సమయంలో బాధ్యతలు స్వీకరించడం ఒక ఎత్తయితే.. వాటిని విజయవంతంగా నిర్వహించి ఫలితాలు సాధించడం మరో ఎత్తు. ఈ విషయంలో రమేష్ తనదైన ముద్ర వేశారని చెప్పవచ్చు.



అనేక ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు

ఎన్నో ఏళ్లుగా మున్నానగర్ రమేష్ సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి సాయం అందించడం, దేవాలయా లు, దర్గా నిర్మాణాలకు తనవంతు చేయూత, ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత కంటి ఆపరేషన్లు, ఉచితం గా కంటి అద్దాలు పంపిణీ, రక్తదా న శిబిరాలు వంటి సేవా కార్య క్రమాలు, అంతేకాకుండా బలిజ సామాజిక వర్గానికి సంబంధించి న సమస్యలు, హక్కులు, అభివృద్ధి అంశాలపై రమేష్ గళమె త్తుతూ వస్తున్నారు. సామాజిక వర్గానికి ఎదురయ్యే సమస్యలపై స్పందించ డం, అవసరమైన సందర్భాల్లో నాయకులు, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించు కున్నారు. ఈ క్రమంలో యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలతో పరిచయాలు పెంచుకున్నారు. యువత ను ఒక వేదికపైకి తీసుకురావడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, ప్రజా సమస్యలపై స్పందించడం వంటి కార్యక్రమాలతో తన పరిధిని విస్తరించుకున్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యక్తిగత పరిచయాలు, సామా జిక సంబంధాలను కొనసాగిం చడం కూడా ఆయనకు కలి సొచ్చిన అంశాలుగా అను చరులు భావిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీకి వీర విధేయుడు..

తెలుగుదేశం పార్టీకి అత్యంత విధేయుడిగా మున్నా నగర్ రమేష్ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగి స్తున్నారనే అభిప్రాయం స్థానిక రాజకీయ వర్గాల్లో ఉంది. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను కొనసాగిస్తూ రాజకీయంగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కార్యక్రమాల పట్ల స్వయాన మంత్రి నారా లోకేష్ అభినందిస్తూ అవార్డును ప్రధానం చేయడం గమ నార్హం. పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల వ్యవహారాలు, స్థానిక రాజకీయ పరిణామాల్లో చురుకైన పాత్ర పోషించడం ద్వారా తన రాజకీయ అనుభవాన్ని పెంచుకున్నారు. ముఖ్యంగా యువతలో ఉన్న పరిచయాలు, సామాజిక వర్గాల్లోని సంబంధాలు ఆయనకు రాజకీయంగా అదనపు బలంగా మారాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

భార్య స్వాతికి డిప్యూటీ మేయర్ ఛాన్స్ !?

ఇదిలా ఉండగా, తాజాగా అనంతపురం నగర రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. మున్నానగర్ రమేష్ భార్య తొండపునాటి స్వాతి పేరు డిప్యూటీ మేయర్ పదవికి సంబంధించి రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. విద్యావంతురా లిగా, రాజకీయ అవగాహన కలిగిన కుటుంబ నేపథ్యం ఉన్న వ్యక్తిగా స్వాతికి అవకాశం దక్కవచ్చు న్న ప్రచారం సాగుతోంది. మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా యువతకు, ముఖ్యంగా విద్యావంతులైన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో స్వాతి పేరు తెరపైకి రావడం ప్రాధాన్యత సంత రించుకుంది. జెన్‌జీ ఆలోచనా విధానం, ఆధునిక దృక్పథం, విద్యా నేపథ్యం, రాజకీయ అనుభవం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన పరిచయాలు ఆమెకు అనుకూల అంశాలుగా చర్చించుకుంటు న్నారు. అయితే డిప్యూటీ మేయర్ ఎంపికలో సామాజిక సమీకరణాలు, రాజకీయ సమతుల్యత, పార్టీ నాయకత్వ నిర్ణయం, కార్పొరేటర్ల మద్దతు వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో స్వాతికి అవకాశం దక్కుతుందా ? అనే ప్రశ్న నగర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

రమేష్ మార్క్ రాజకీయం.. భవిష్యత్తుపై ఆసక్తి !

మొత్తంగా చూస్తే.. యూత్‌లో ఉన్న క్రేజ్‌ను రాజకీయంగా వినియోగించుకోవడం, బలిజ సామా జిక వర్గంలో తనకున్న పరిచయాలను కొనసాగిం చడం, పార్టీ నేతలతో సన్నిహితంగా ఉండడం, ఎన్నికల్లో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం వంటి అంశాలు మున్నానగర్ రమేష్ రాజకీయ ప్రస్థానంలో కీలకంగా కనిపిస్తున్నాయి. మూడు డివిజన్లలో విజయాలు ఆయన రాజకీయ ప్రభావంపై చర్చకు దారితీస్తుండగా, మరోవైపు భార్య తొండపునాటి స్వాతికి డిప్యూటీ మేయర్ పదవి దక్కుతుందా ? అనే అంశం ఉత్కంఠను పెంచుతోంది. ఒకవైపు రమేష్ రాజకీయ చాణ క్యం.. మరోవైపు స్వాతి రాజకీయ రంగ ప్రవేశంపై ఆసక్తి.. వెరసి అనంతపురం నగర రాజకీయాల్లో ఈ కుటుంబం పేరు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోండి

- అనంత అభివృద్ధే లక్ష్యంగా పని చేయండి
- డివిజన్ స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావాలి
- అవినీతి వ్యవహారాలు, వివాదాలకు దూరంగా ఉండండి
- పదవులంటే అలంకారం కాదు.. సేవ చేసే అవకాశం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచన



అనంతపురం, నవంబర్ 6 అనంత సూర్య :

అనంతపురం నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు, అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శు క్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేషన్ మేయర్ గా ఎన్నికైన రమేష్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లుగా గెలిచిన, ఓడిపోయిన అభ్యర్థులు, స్థానిక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంతి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ అర్పించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం వెనుక ప్రతి ఒక్కరి కష్టం ఉందన్నారు. అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలు చేసినా భయపడలేదన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిల బెట్టుకోవాలన్నారు. డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కొన్ని డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. ఓటమికి ఎవరూ చింతించాల్సిన అవసరం లేదని, మనమంతా బలంగా నిలబడడం వల్లే మేయర్ స్థానాన్ని గెలుచుకోగలిగామని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారంతా ప్రజలకు మరింత చేరువ కావాలని అన్నారు. అవినీతికి తావులేకుండా అనం తపురం నగరాన్ని ప్రశాంతంగా ఉంచడమే మన ముందున్న ప్రథమ కర్తవ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు ఎక్కువయ్యాయన్నారు. ప్రజలు అన్నింటినీ గమనించే వైసీపీకి పట్టం కట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి అనంతపురం కార్పొరేష న్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, వచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేయర్, కార్పొరేటర్ పదవులు అంటే అధికారం చలాయించడానికి కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాలు అని తెలియజేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే ఆలోచిస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి వీలైంత వరకు డివిజన్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల ని సూచించారు. మేయర్‌గా గెలిచిన రమేష్ గౌడ్ మాట్లాడు తూ అందరూ కలిసికట్టుగా పని చేసి అనంతపురం నగరాన్ని సుందరమైన, స్వచ్ఛమైన నగరంగా తీర్చిదిద్దుదా మన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని తెలిపారు. తనను మేయర్‌గా గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



రేణుక యల్లమ్మ దేవాలయంలో మేయర్ రమేష్ ప్రత్యేక పూజలు



అనంతపురం, నవంబర్ 6 అనంత సూర్య :

అనంతపురం నగర శివారులోని రాయల్ నగర్‌లో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ చిట్టూరు రమేష్ గౌడ్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి నగర ప్రజల సంక్షేమం, తన పాలనా బాధ్యతల కోసం దైవాన్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించి మేయర్ రమేష్ గౌడ్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో నగరంలో అన్ని వర్గాల ప్రజల కోసం పనిచేసేం దుకు సంకల్పించానని ఆయన తెలిపారు. ఆలయ దర్శనం అనంతరం మేయర్ రమేష్ గౌడ్ ఈడిగ గౌడ సంఘం నాయకులు, సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, స్థానిక సమస్యలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గౌడ సంఘం నాయకులు మేయర్‌గా రమేష్ గౌడ్ విజయానికి అభినందన లు తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని వారు కోరారు.

శ్రీచైతన్యలో మెగా రక్తదాన శిబిరం విజయవంతం

అనంతపురం, నవంబర్ 6 అనంత సూర్య :

స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైందని శ్రీచైతన్య విద్యా సంస్థల అనంతపురం, సత్యసాయి జిల్లాల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఏజీఎం సుబ్బారెడ్డి, శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ డీన్ ప్రసాద్ కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం నగరంలో ఉన్న శ్రీనిత వాలంటరీ బ్లడ్ సెంటర్ వారి సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని, ఈ రక్తదాన శిబిరంలో శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన ఉద్యోగులు, శ్రేయోభిలా షులు దాదాపు 52 మంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలి చారని కొనియాడారు. మంచికి, మానవత్వా నికి, సమాజ సేవకు ప్రతిరూపంగా నిలిచే శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ జన్మదినం రోజున రక్త దాన శిబిరాన్ని నిర్వ హించడం పరిపాటి అని అన్నారు. అనంతరం శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ డీన్ ప్రసాద్‌తో కలిసి రక్తదానం చేసిన దాతలకు పండ్లు, బిస్కెట్లు, ఫ్రూటీ అందిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, కోఆర్డి నేటర్లు, డీన్లు, కాలేజీకి చెందిన ఫ్యాకల్టీ, ఉపాధ్యా యులు, ఏవోలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.







అయ్యప్ప దీక్షను స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, నవంబర్ 6 అనంత సూర్య :

నిత్యం రాజకీయాలు, ప్రజాసేవలో బిజీ బిజీగా ఉండే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మరోసారి ఆధ్యాత్మిక బాటలో అయ్యప్ప దీక్షను స్వీకరించారు. హైదరా బాద్‌లో మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి పవిత్ర హస్తాల మీదుగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అయ్యప్ప మాలధారణ చేపట్టారు. ఇప్పటికే విజయవంతంగా 25 సార్లు అయ్యప్ప మాల ధరించి శబరిమల క్షేత్రాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఇది 26వ సారి అత్యంత నిష్ఠతో ఈ పవిత్ర దీక్షను చేపట్టారు. రాబోయే 41 రోజుల పాటు కఠిన నియమాలను పాటిస్తూ, ఆ మణికంఠుని సేవలో ఉండనున్నారు. మన అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలందరిపై ఆ హరిహరసుతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వర్ధిల్లాలని కోరుకుంటూ నియమ నిష్ఠలతో ఈ దీక్షను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405